గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్



విద్యుత్ శాఖ డీఈ, శ్రీధర్

బన్సీలాల్‌పేట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా గణేశ్ మండపాలకు ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తామని సికింద్రాబాద్ విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మండపాల్లో కరెంట్ కోసం విద్యుత్ శాఖకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయమై ఏఈలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆయా సెక్షన్ ఏఈలు తమ పరిధిలోని మండపాలను సందర్శిస్తారన్నారు. నిర్వాహకులు ఎంసీబీ నుంచి కరెంట్ సప్లై తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 17న నిమజ్జనోత్సవం బయలుదేరే ప్రధాన రహదారుల్లో విద్యుత్ స్తంభాల చుట్టూ ప్లాస్టిక్ షీట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ సెక్షన్ కార్యాలయాల్లోని ఏఈలను సంప్రదించాలని కోరారు.

వరద సహాయంపై సినీ పరిశ్రమ పెద్దల వివక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: వరద సహాయంపై సినీ పరిశ్రమ పెద్దలు వివక్ష చూపుతున్నారని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా వరదల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది చనిపోయారని, వందలాది మంది నిరాశ్రయులు కాగా పంట, ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. బాధితుల కోసం సినీ రంగ ప్రముఖ సంస్థలు, నటులు కేవలం ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడుకు మాత్రమే కోట్లాది రూపాయాల విరాళాలు అందించి తెలంగాణను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైజయంతి మూవీస్ సంస్థ వారు ఏపీకి రూ.25 లక్షల విరాళం ప్రకటించి తెలంగాణకు ఒక్క రూపాయికూడ ఇవ్వక పోవడం దారుణమని పేర్కొన్నారు.

నాడు 25 నేడు 5.20 ఎకరాలు..

కబ్జా కోరల్లో తార్నాక ఎర్రకుంట చెరువు..!



తార్నాక ఎర్రకుంట చెరువు దుస్థితి

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు
- 2009లో మినీ ట్యాంక్ బండ్ పనులకు శ్రీకారం
- ఇరిగేషన్ అధికారులను అడ్డుకున్న భూ కబ్జాదారులు
- యథేచ్ఛగా సాగుతున్న భూముల ఆక్రమణలు

లాలాపేట: నిజాం హయాంలో తార్నాక, లాలాపేట, నాచారం, మల్లాపూర్ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించిన తార్నాక ఎర్రకుంట చెరువు కబ్జా కోరల్లో చిక్కుకున్నది. భవన నిర్మాణ వ్యర్థాలతో చెరువును పూర్తిగా కప్పేయడంతో రూపరేఖలే మారిపోయాయి. సర్వే నంబర్ 120,121,122,1223,124 లలో దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రకుంట చెరువు ఉండేది. అయితే కాల క్రమేణా చెరువు భూములను కొందరు ఆక్రమించగా, ప్రస్తుతం 5.20 ఎకరాల విస్తీర్ణాన్ని ఎఫ్‌టీఎల్‌గా నిర్ణయించారు. అది కూడా డ్రైనేజీ నీటితో కాలుష్య కాసారంగా మారింది. ప్రభుత్వ భూములు, చెరువు, కుంటలను పరిరక్షించాల్సిన మారేడుపల్లి రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు వంతపాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో భూ బకాసూరులు మరింతగా రెచ్చిపోయి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అని తేడా లేకుండా భూములను యథేచ్ఛగా అక్రమించి బహుళ అంతస్తులు, పక్కా భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన ఓ నాయకుడి ఇల్లు సైతం ఎఫ్‌టీఎల్ పరిధిలో సగం వరకు ఉన్నట్లు తార్నాక వాసులు పేర్కొంటున్నారు. మరికొందరు అందులో కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.



ఇరిగేషన్ అధికారులు చెరువు భూముల్లో చెట్లను తొలగించిన దృశ్యం (ఫైల్)

తార్నాక ఎర్రకుంట చెరువును హైడ్రాలో చేర్చాలి

హైదరాబాద్ చుట్టూ ఉన్న చెరువులు, కుంటల పునరుద్ధరణకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చి హైడ్రాను ప్రజలందరూ స్వాగతిస్తున్నారు. ఇటీవల నగరంలోని పలు చెరువు భూముల్లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తార్నాక ప్రజలందరి దృష్టి ఎర్రకుంట చెరువు వైపునకు మళ్లింది. తార్నాక పరిసర ప్రాంతాల ప్రజలకు గతంలో సాగు, తాగు నీరు అందించిన ఎర్రకుంట చెరువును సైతం పునరుద్ధరించడానికి హైడ్రాలో చేర్చాలని తార్నాక వాసులు కోరుతున్నారు. ఆ చెరువు భూములు నిరుపయోగంగా మారడంతో దోమలు, క్రిమీ కీటకాలకు స్థావరంగా మారింది. ఇదే అదనుగా భావించి రోజుకొక్కరూ చెరువు భూముల్లో తమకు స్థలం ఉందంటూ తప్పుడు పత్రాలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి..



తార్నాకలోని ఎర్రకుంట చెరువు భూములను రీ సర్వే చేయాలి. ఇప్పటికే నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ పరిధిలో చెరువును పునరుద్ధరించి పరిరణకు చర్యలు తీసుకోవాలి. గతంలో ఆలకుంట సరస్వతి కార్పొరేటర్‌గా ఉన్న హయాంలో చెరువు పరిరక్షణకు ప్రయత్నించినప్పటికీ కబ్జాదారుల ధాటికి ముందుకు వెళ్లలేకపోయారు. ప్రస్తుత హైడ్రా కమిషనర్ రంగనాథ్ తార్నాక ఎర్రకుంట ఎరువుపై దృష్టి సారించాలి. అందులో ఇప్పటికే వెలిసిన అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించి కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– ఆలకుంట హరిబాబు, బీఆర్ఎస్ యువజన విభాగం గ్రేటర్ అధ్యక్షుడు

ముందుకు సాగని మినీ ట్యాంక్ బండ్ పనులు..

తార్నాక ఎర్రకుంట చెరువు భూములు అన్యాక్రాంతం కాగా మిగిలిన ఐదున్నరెకరాల ఎఫ్‌టీఎల్‌లో మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తామని 2009లో అప్పటి జీహెచ్ఎంసీ మేయర్ బండ కార్తీకరెడ్డి హయాంలో అప్పటి కలెక్టర్ నవీన్‌మిట్టల్‌ను తీసుకువచ్చి చెరువును పరిశీలించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. అయితే సుదీర్ఘ కాలం తర్వాత 2022 నవంబర్‌లో ఇరిగేషన్ అధికారులు చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టి చెరువు భూముల్లో పెరిగిన చెట్లను సైతం తొలగించారు. అంతలోనే ఆ భూముల ఆక్రమణదారులు దాదాపు 9 మంది కోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం స్టే విధించడంతో ఆ పనులు కాస్త నిలిచిపోయాయి. నాటి నుంచి మినీ ట్యాంక్ బండ్ పనులు అలాగే నిలిచిపోయాయి.

గణేశ్ నవరాత్రులకు రండి



ఎమ్మెల్యే తలసానిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సనత్‌నగర్: సికింద్రాబాద్‌లోని శ్రీగణేశ్ ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించనున్న గణేశ్ నవరాత్రులకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను అందజేశారు. అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అందజేసిన వారిలో చైర్మన్ సత్యనారాయణ, హన్మంతరావు, వినోద్‌కుమార్, జయాజ్, ఆలయ సూపరింటెండెంట్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాయకులు

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ బీజేపీ సభ్యత్వ నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న ప్రధాని మోదీ సభ్యత్వ నమోదు స్వీకరించారని, అనంతరం ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసుకునే వీలు కల్పించినట్లు తెలిపారు. మొబైల్ ద్వారా ఎలా సభ్యత్వం చేసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించి పలువురికి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, శ్యామ్‌కుమార్, సురేశ్, సత్యనారాయణ, విశ్వనాథ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సికింద్రాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ట్రోఫీలో విజయం సాధించిన జట్టు సభ్యులు

ఈఎస్ఐలో క్రీడాపోటీలు

అమీర్‌పేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మినిస్ట్రీ ఆఫ్ లేబర్, ఎంప్లాయిమెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈఎస్ఐ కార్పొరేషన్ పిలుపు మేరకు ఈఎస్ఐసీలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. వివిధ రకాల పోటీలు జరగగా ఒక్కో జట్టుకు ఒక్కో ప్రముఖ క్రీడాకారుల పేర్లతో నామకరణం చేశారు. ఉద్యోగులు 4 జట్లుగా ఏర్పడ్డారు. విజయం సాధించిన జట్లకు మెడికల్ కళాశాల డీన్ శిరీష్ కుమార్ జీ చావస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు రాజేందర్ పిళ్లై, సచిన్, పారా మెడికల్ యూనియన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి అల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో దాడుల సంస్కృతి తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: రాజకీయాల్లో దాడుల సంస్కృతి తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ రెడ్డి వాహనాలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్లన్న

లాలాపేట: ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొ కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో మాదిగ విద్యార్థి, యూత్ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డె ఎల్లన్న మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు అన్ని వర్గాలను ఏకం చేసి జేఏసీలుగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా ఉద్యమ నాయకుడికి సరైన గుర్తింపునిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎమ్మెల్సీ ప్రొ కోదండరాంకుకు విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పించాలని కోరారు.

చీకట్లో ఓయూ క్యాంపస్



ఉస్మానియా యూనివర్సిటీ: వర్షాల కారణంగా చెట్లు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఓయూ క్యాంపస్ చీకటి మయమైంది. మూడు రోజులుగా అంతరాయం వలన క్యాంపస్‌లోని వీధి దీపాలు వెలగకపోవడంతో విద్యార్థులు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారికి సుమారు కిలోమీటరు దూరం గల లేడీస్‌తో పాటు బాయ్స్ హాస్టల్ విద్యార్థులు సెల్ ఫోన్ వెలుగులో దారిని వెతుకుంటూ వెళ్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని విద్యార్థులు కోరారు.

‘ఆశాజనకంగా లేని యూపీఎస్’



శ్రీధర్, ఎన్‌సీసీపీఏ ఉపాధ్యక్షుడు

అడ్డగుట్ట: ఇటీవల ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) ఆశాజనకంగా లేదని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎన్‌సీసీపీఏ ఉపాధ్యక్షుడు సాగరం శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2004 జనవరి 1 తర్వాత రిక్రూట్ అయిన ఉద్యోగులపై ఇందులో పక్షపాత వైఖరి కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన నకారా జడ్జిమెంట్‌కు వ్యతిరేకంగా ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్ కార్మికులు ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పోరాడుతున్నారని, దీనివల్ల కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌పీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారుస్తామని నిర్ణయించుకున్నాయని పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం హైపవర్ కమిటీని ఏర్పాటు చేసి ఎన్‌పీఎస్ మాత్రం పూర్తిగా రద్దు చేసేది లేదని చెబుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత యూపీఎస్ స్కీమ్ 50 శాతం పెన్షన్ ఇచ్చేందుకు అంగీకరించినా, ప్రతీ నెల బేసిక్ పే, డీఏ నుంచి 10 శాతం రికవరీ చేయడం తప్పనిసరని పేర్కొందని తెలిపారు. ఓపీఎస్‌లోని చాలా అంశాలు యూపీఎస్‌లోని లేవని ఓపీఎస్‌నే పునరుద్ధరించాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. శిథిల భవనాలను గుర్తించి అందులోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు ఎలాంటి రోడ్ల తవ్వకాలు చేపట్టవద్దని, దోమలు విజృంభించకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ వెంకటేశ్, డీఈఈ సువర్ణ, ఏఈ వేణు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఎస్ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

శ్రావణమాస ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



అన్నదానం చేస్తున్న పూజారి వెంకటరమణ

అడ్డగుట్ట: శ్రావణ మాసం చివరి మంగళవారం అమావాస్య సందర్భంగా తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆంజనేయస్వామికి అభిషేకాలు, పంచామృతాలు, గంధంతో స్నానం, సింధూరం, ఆకుపూజ, వివిధ పుష్పాలతో అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించినట్లు పూజారి వెంకటరమణ తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి కార్మికులకు గాయాలు



గాయపడ్డ అనిల్,



శంకర్

కంటోన్మెంట్: విద్యుత్ మరమ్మతులు చేస్తూ ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బోయిన్‌పల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం న్యూ బోయిన్‌పల్లి జయనగర్ చౌరస్తాలో వృక్షం 11 కేవీ విద్యుత్‌లైన్ స్తంభంపై కూలింది. మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఓల్డ్‌బోయిన్‌పల్లిలో నివాసముండే కాంట్రాక్ట్ కార్మికులు శంకర్ (35), అనిల్ (30) స్తంభం ఎక్కి, తీగలు లాగుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో కిందపడ్డారు. అప్రమత్తం అయిన అధికారులు కార్మికులను బాలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనిల్‌కు తీవ్రగాయాలు కాగా, శంకర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి అంతర్గత విచారణ చేపట్టినట్లు ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గణేశ్ నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలి



బోర్డు అధికారులతో కలిసి డ్రైనేజీ లీకేజీని పరిశీలిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: గణేశ్ నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బోర్డు సిబ్బందికి సూచించారు. కంటోన్మెంట్ పరిధిలోని మండపాల వద్ద ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశముందని వాటిని గుర్తించి, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయని పలువురు తన దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు. కార్ఖానా రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రోడ్డుపై పొంగుతున్నందున ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు.

కూలిన భారీ వృక్షం



చెట్టును తొలగిస్తున్న శానిటేషన్ విభాగం సిబ్బంది ట్రాఫిక్ పోలీసులు

రసూల్‌పురా: వర్షాలకు కంటోన్మెంట్‌లోని బొల్లారం రిసాలబజార్ చెక్‌పోస్టు సమీపంలోని రాజీవ్‌రహదారిపై మంగళవారం తెల్లవారుజామున భారీ వృక్షం కూలిపోయింది. కాగా సమాచారం అందుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ విభాగం దఫేదార్ రాములు నేతృత్వంలో సిబ్బంది పడిపోయిన వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అన్నదానం

రసూల్‌పురా: అమావాస్యను పురస్కరించుకుని రసూల్‌పురాలోని పోలీస్‌లైన్స్, ఉషా గోదాం, బీరప్ప ఆలయ ప్రాంతాల్లో మంగళవారం అన్నదానాలు నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో జంగిల్ రాజు, అశోక్, జబ్బార్, మణికంఠ. కిషన్, నరసింహ రెడ్డి బీరప్ప టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానంలో కేశవరెడ్డి తదితరులు

వేతనాలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వండి



కాంట్రాక్టు కార్మికులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాజనర్సింహ

గాంధీఆస్పత్రి : నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని గాంధీ ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులు వైద్యాశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. గాంధీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అనంతరం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఆస్పత్రిలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, అయినా కాంట్రాక్టర్లు సరిగా వేతనాలు చెల్లించడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్‌లు జమ చేయడం లేదని, తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆస్పత్రి అధికారులకు చెబితే తమకు సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా ప్రతినెల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అలాగే పలువురు నర్సింగ్ సిబ్బంది కూడా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని వారికి హామీనిచ్చారు. అనంతరం కాంట్రాక్టు కార్మికులు, నర్సింగ్ సిబ్బంది సమస్యలపై ఆస్పత్రి పాలనాధికారులతో చర్చించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 75, క్యాప్సికం 50, పచ్చకాకర 26, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

ఓయూ సన్మానసభలో ఎమ్మెల్సీ కోదండరామ్



ప్రొ.కోదండరామ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ అన్నారు. రాష్ట్ర యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల ఆధ్వర్యంలో ప్రొ.కోదండరామ్‌ను ఓయూలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి డా.ఉపేందర్ అధ్యక్షత వహించగా సామాజికవేత్త ప్రొ.హరగోపాల్, రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, మాజీ చైర్మన్ ప్రొ.పాపిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొ.కోదండరామ్‌ను విద్యాశాఖ మంత్రిగా చేడయం ద్వారనే విశ్వవిద్యాలయాలు ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని ప్రొ.హరగోపాల్ అన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ కోసం గత ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన్నట్లు ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ ప్రొ.పాపిరెడ్డి అన్నారు. ప్రొ.కోదండరామ్‌ను సన్మానించుకోవడం ఓయూకు గర్వకారణమని ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్ర కన్వీనర్ ధర్మతేజ, వివిధ వర్సిటీల అధ్యాపక నేతలు విజయేందర్‌రెడ్డి, వేల్పుల కుమార్, సీహెచ్.వెంకటేశ్వర్లు, మహేశ్వర్‌రెడ్డి, దత్తాహరి, రామేశ్వర్ రావు, బి.రాంలింగంయాదవ్, మంజుల, అమరేందర్, శివారెడ్డి, కనకయ్య, రాజేష్, సుల్తానా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.